క్లుప్తంగా

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి



వాజేడు: అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం బొల్లారంలో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చినట్‌లెతై వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బొల్లారం గ్రామ శివారులో వాహన తనిఖీ చేపట్టారు.

సమ్మె నోటీస్ ఇచ్చిన ఆశ వర్కర్లు



వెంకటాపురం(కె): ఈ నెల 25 నుంచి ఆశ వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేయనున్నట్లు సమ్మె నోటీసులను ఆశ వర్కర్లు తహసీల్దార్ నల్లెట్ల సృజన్‌కుమార్‌కు, పోలీస్‌స్టేషన్‌లో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఉష, మంగ, వేణి, పూర్ణ, దేవేంద్ర, వెంకటలక్ష్మి, ఉన్నారు.

రేషన్‌షాపుల్లో ముమ్మరంగా కేవైసీ



వెంకటాపురం(కె): మండలంలోని రేషన్‌షాపుల వద్ద ముమ్మరంగా రేషన్‌కార్డు లబ్ధిదారులు శనివారం కేవైసీ చేయించుకుంటున్నారు. కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల అందరి వేలి ముద్రలతో తప్పనిసరిగా చేసుకోవాలని ప్రభుత్వం నిబంధన విధించింది. రేషన్‌డీలర్లు కార్డుదారులు కేవైసీ చేయించుకోవాలని సమాచారం అందించారు. శనివారం నుంచి కార్డుదారులు షాపుల వద్ద బారులు తీరారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా షాపువద్దకు వచ్చి కేవైసీ చేసుకుంటున్నారు.

వాహనాల తనిఖీ



ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధిలోని హనుమాన్‌నగర్ వద్ద 163 జాతీయ రహదారిపై శనివారం ఎస్సై కృష్ణప్రసాద్ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. వరంగల్–ఏటూరునాగారం నుంచి ఛత్తీస్‌గఢ్, ఖమ్మం ప్రాంతాలకు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి అందులో ప్రయాణిస్తున్న వారి వివరాలను సేకరించారు. అలాగే వాహనాల్లో ప్రయాణిస్తున్న సామగ్రిని సోదా చేసి పంపించారు. ప్రతి వాహనదారుడు ఆర్‌టీఏ నిబంధనలను పాటించాలన్నారు. సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

గ్రూపు–1 రద్దుపై హర్షం



ఏటూరునాగారం: గ్రూపు–1 రద్దు చేసిన న్యాయస్థానం నిరుద్యోగులకు అండగా నిలబడడం హర్షించదగ్గవిషయమని బీఎస్పీ ములుగు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఈసం హరికృష్ణ, అసెంబ్లీ అధ్యక్షుడు ఎంపెల్లి వీరస్వామి, ఇన్‌చార్జ్ గడ్డం భీతి అన్నారు. శనివారం మండలకేంద్రంలో బీఎస్పీ నాయకులు ప్లకార్డులు చేతబూని న్యాయస్థానం చేసిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గ్రూపు–1 రద్దు కోసం దీక్షలు, నిరసనలు చేపట్టారన్నారు. గ్రూప్–1 కుంభకోణంలో సీఎం కేసీఆర్, కేటీఆర్ అవినీతికి పాల్పడిన వారిపై విచారణ చేపట్టి వెలుగులోకి తీసుకురావాలని కోరారు. సాగర్, కిషోర్, పాషా పాల్గొన్నారు.

ఆశలు అడియాశలయ్యాయి

గృహలక్ష్మి పథకానికి అనర్హుల ఎంపిక
- ఫైరవీదారులకే ఇళ్లు మంజూరు..
- పేదలకు మొండిచేయి

ఎస్ఎస్‌తాడ్వాయి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరవుతాయని ఆశించిన అర్హులైన లబ్ధిదారుల ఆశలు అడియాశలయ్యాయి. మండలంలోని గ్రామాల్లో కొంతమంది పూరిగుడిసెల్లో జీవనం సాగిస్తుండగా మరికొంత మంది లబ్ధిదారులు సొంత ఇళ్లు లేక అద్దెకు ఉంటున్నారు. అన్ని అర్హతలు ఉన్నాయని గృహాలక్ష్మి పథకం కింద అధికారులు ఎంపిక చేస్తారని ఎదురు చూసిన లబ్ధిదారుల ఆశలు ఆవిరైపోయాయి. పైరవీదారులకు ఇళ్లు మంజూరు చేసి అసలైన లబ్ధిదారులకు అధికారులు మొండిచేయి చూపారనే ఆరోపణలు వస్తున్నాయి. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు చేయకపోవడంతో అధికారులు, ప్రభుత్వ పాలకులపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అర్హులకు దక్కేనా ..? అనే కథనాన్ని ఆగస్టు 19న 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది.



ఈ ఫొటోలోని మహిళ భూమ శారద. గృహలక్ష్మి సొంతింటి కల నిరాశను మిలిగిల్చింది. నివసిసేందుకు సొంత ఇళ్లు లేక చిన్నపాటి రేకుల షెడ్డు ఉన్న ఇంటిని అద్దెకు తీసుకుని జీవిస్తున్నా. గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్నా. అన్ని అర్హతలు ఉన్నా తనకు ఇల్లు మంజూరువుతుందని ఆశ కలిగింది. కానీ అధికారులు గుర్తించలేదు. ఇళ్ల జాబితాలో పేరు లేకపోవడం బాధ కలిగించింది.



ఈ ఫొటోలోని ఆదివాసి మహిళ తాడ్వాయిలోని ఎర్రగడ్డకు చెందిన ఇర్ప లక్ష్మి. కూలీ పనులకు వెళ్తేనే పూట గడుస్తుంది. పూరి గుడిసెల్లోనే నివసిస్తుంది. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుంది. సర్వేకు వెళ్లిన అధికారులు అర్హులుగా గుర్తించారు. ఇటీవల అధికారులు మంజూరు చేసిన జాబితాలో ఈమె పేరు లేదు.



ఈ ఫొటోలోని మహిళ నర్సింగాపూర్‌కు చెందిన లక్కెపురం సు శీల. కొన్నేళ్ల క్రితం వర్షాలకు ఇళ్లు పూర్తిగా కూలిపోయింది. ఇళ్లు కట్టుకునే స్తోమత లేక రెండేళ్ల నుంచి ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తుంది. గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకుంది. ఇళ్లు మంజూరు కాకపోవడంతో నిరాశే మిలిగింది.



ఈ ఫొటోలోని గుడిసె నర్సింగాపూర్‌కు చెందిన ఇప్ప స్వరూపకు చెందింది. భర్త ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ గుడిసెలోనే జీవిస్తుంది. వర్షానికి కురవకుండా చక్కదిద్దుకునే స్తోమత లేదు. గృహలక్ష్మిలో ఇళ్లు వస్తాయని తెలుసుకుని దరఖాస్తు చేసుకున్నా ఎంపిక చేయలేదు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ములుగు రూరల్: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నేత అజ్మీరా ప్రహ్లాద్



మంగపేట : బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లికి చెందిన శెంకేసి సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి హరీష్‌గౌడ్, యాకూబ్, వెంకటేశ్వర్లు, బాబు, యుగేందర్, చంద్రాచారి, రఘుపతి, సతీష్, వేణు తదితరులు ఉన్నారు.

మంగపేట: మండలంలోని తిమ్మంపేట పంచాయతీ పరిధిలోని గోబ్రియానాయక్ తండాకు చెందిన పాల్తీయ లక్ష్మి(85) శనివారం మృతి చెందగా మృతురాలు కుటుంబాన్ని బీజేపీ నాయకులు పరామర్శించి రూ.2000 నగదు ఆర్థిక సాయం అందచేశారు. పరామర్శించిన వారిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లొంక రాజు, యువమోర్చా జిల్లా కార్యదర్శి బొంబోతుల మురళి, గిరిజన మోర్చా వనబంధు కన్వీనర్ భూక్య రతన్‌సింగ్, మండల కోశాధికారి గాదె శ్రీనివాస్‌చారి, సీనియర్ నాయకులు యర్రంసింగ్ యంగయ్య, ఉన్నారు.

తిమ్మాపురంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

మంగపేట: మండలంలోని నిమ్మగూడెం పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యాధికారి శ్రావణ్ వైద్యసిబ్బందితో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వ్యాధులతో ఇబ్బంది పడుతున్న 38 మంది బాధితులను గుర్తించి మందులను పంపిణీ చేశారు. పీహెచ్‌సీకి వచ్చి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో పరిసరాలను పరిశీలించి జనావాసాల మధ్య వర్షపు నీటితో పాటు మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రధానంగా మలేరియా జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు దోమతెరలను వినియోగించాలని, టైఫాయిడ్ బారిన పడకుండా కాచి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. ఆరోగ్య జాగ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం సీతారావమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనర్హులను తొలగించాలని వినతి



ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రభాకర్

మల్హర్: ఇటీవల విడుదలైన గృహలక్ష్మి పథకంలోని జాబితాలో అనర్హులను తొలగించి, అర్హులైన వారికి న్యాయం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముడతనపల్లి ప్రభాకర్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ విక్రమ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు అనర్హులకు జాబితాలో చోటు కల్పించారని ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయిలో లబ్ధిదారును ఎంపిక చేయాల్సిన ప్రక్రియను బీఆర్ఎస్ నాయకులే అధికారన్ని అడ్డు పెట్టుకోని వారి బంధువులకు, కుటుంబ సభ్యులకు జాబితాలో చోటు కల్పించి ప్రొసిడింగ్‌లను ఇప్పించి పథకాలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. మండల ఉపాధ్యక్షుడు రాగం సతీష్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ నిషాన్‌పాషా, మండల కార్యదర్శి ఊట్నూరి శ్రావణ్, గ్రామస్తులు సంతోష్, సురేష్, రాజమల్లు, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

చిట్యాల: ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ.. క్లస్టర్ ఆపరేటర్లు సురేష్, భాస్కర్, మహేష్ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతిలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీలలో జరిగే ప్రతి పనిని ఆన్‌లైన్ కంప్యూటరీకరణ గత తొమ్మిది సంవత్సరాలుగా చేస్తున్న కనీసం ఈ కంప్యూటర్ ఆపరేటర్లను పట్టించుకున్న పాపాన లేదన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్ ఆపరేటర్‌లను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి



మాట్లాడుతున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల: బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అన్వర్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అంటూ ప్రచారం చేసి, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారని ప్రచారం చేసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకుడే కానీ, ప్రధాన కార్యదర్శి కాదని అన్నారు. ఇప్పటికైనా సత్యాలనే ప్రచారం చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలని, తప్పుడు ప్రచారంతో ప్రజల్లోకి వెళితే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని సూచించారు. ఈ జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, యూత్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

వెంకటాపురం(కె): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కుడుముల సమ్మక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపును నిలుపుదల చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులను ఇచ్చి నియామక పత్రాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొక్కెరి రాంబాబు, చాగంటి నాగమణి, సమ్మక్క, అమ్మాజి, సరోజిని, జ్యోతి, లలిత, కుమారి, వెంకటమ్మ, రమణ ఉన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

మల్హర్: నూతన పట్టా పాస్‌బుక్‌లు జారీ కానీ రైతులు వానాకాలం పంటల సాగు చేసిన వివరాలను రైతులు వారి ఆధార్ కార్డులతో సంబంధిత క్లస్టర్ ఏఈఓల దగ్గర నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వరి, పత్తి సాగు చేసిన రైతులకు పంట వివరాల నమోదు చేయకుంటే పంటలను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ

మహదేవపూర్: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ లక్ష్మీరాజయ్య శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను, వంట, తరగతి గదులను పరిశీలించారు. తమకు గణిత ఉపాధ్యాయుడు లేడని తెలుపగా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన

పలిమెల: పలిమెల మండలం మోదేడ్ గ్రామంలో ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులతో స్పెషల్ వీఓ సమావేశాన్ని అధికారులు శనివారం నిర్వహించారు. అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా స్వయం ఉపాధిపై, 5 థీమ్స్, 39 ఇండికేటర్ల గురించి స్వయం సహాయక గ్రూప్ సభ్యులకు అవగాహన కల్పించారు. పాడి గేదెల పెంపకం, పండ్ల తోటల పెంపకంతో కలిగే లాభాల గురించి వివరించారు.

అదుపు తప్పిన కారు..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం–అన్నారం మూలమలుపు సమీపంలో రోడ్డు పైన కోతుల గుంపు అడ్డురావడంతో కారు అదుపుతప్పి పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన కట్ట శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఆయకు కుటుంబ సభ్యులతో కాళేశ్వరం వచ్చి తిరిగి వెళుతుండగా కోతుల గుంపు రోడ్డు అడ్డు రావడంతో కారు అదుపు తప్పడంతో శ్రీధర్ కాళ్లకు, చేతులకు గాయాలు అయ్యాయి.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న గండ్ర జ్యోతి

టేకుమట్ల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇటీవల పలు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి శనివారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందించి, భరోసా కల్పించారు. ఆమె వెంట ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, సర్పంచ్‌లు కొలిపాక రాజయ్య, తదితరులు ఉన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే సీతక్క అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన నీళ్లు, మన నిధులు నియామకాలు అంటూ మోసం చేసి గద్దెను ఎక్కిన కేసీఆర్ వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ఎందుకు సహాయక చర్యలు చేపట్టలేదని అన్నారు. ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేకపోతున్నాడని అన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ నియోజకవర్గానికి 300 మాత్రమే ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రైతే రాజు అని చెప్పిన ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, రవళిరెడ్డి రాంరెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, జెడ్పీటీసీ నాయకరమ్ చంద్‌గాంధీ, పుష్పలత శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బానోత్ రవిచందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జనం



వెంకటాపురం(కె) : నిమజ్జనం సందర్భంగా ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



ములుగు : అన్నదానం చేస్తున్న సీఐ రంజిత్



ఏటూరునాగారంలో..

వెంకటాపురం(కె): మండలంలో ఘనంగా గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండపాల్లో ఐదురోజుల పాటు నవరాత్రులు నిర్వహించి పూజలు చేసిన అనంతరం 6వ రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. దుర్గమ్మగుడి సెంటర్, పాతమార్కెట్ సెంటర్, శివాలయం సెంటర్, టెలిఫోన్ ఎక్చైజ్ సెంటర్, హాస్టల్స్ సెంటర్, విగ్రహాలను మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం పాత్రాపురం పంచాయతీలోని పాలెం వాగులో నిమజ్జన నిర్వహించారు. శివాలయం సెంటర్లో మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద లడ్డును వెంకట్ మేస్త్రీ రూ.25 వేలు, కలశంను నాగూర్ మేస్త్రీ రూ.11 వేలకు దక్కించుకున్నారు.

ఘనంగా ఊరేగింపు

ఏటూరునాగారం: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వినాయకుడి ఊరేగింపు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుంచి ఐటీడీఏ వద్ద ఉన్న గణపతి మండపానికి విద్యార్థులు తయారు చేసిన మట్టివినాయకులను ఐదు రాత్రులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మండపంలో అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఓ అరుణ, టీచర్స్ ప్రశాంతి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

సన్‌రైజర్స్‌యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

స్థానిక గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సన్‌రైజర్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గణపురం రాజశేఖర్, సరికొప్పుల నవీన్, భవాని శంకర్, ప్రదీప్, నాగార్జున, రవి, రమేష్, శ్రీనివాస్, సాంబయ్య, భాస్కర్ పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని సేవా యూత్ సభ్యులు గణపతి నవరాత్రుల సందర్భంగా బస్టాండ్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గణేష్, లక్కి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో గ్రామాలు ముందుండాలి



ఎస్ఎస్ తాడ్వాయి : పిల్లలకు బహుమతి అందజేస్తున్న ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్



వాజేడు : పిచ్చి మొక్కలను తొలగిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు స్వచ్ఛతలో గ్రామాలు ముందుండాలని ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర శనివారం తాడ్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని బస్‌స్టేషన్, సామాజిక మరుగుదొడ్డి పరిసరాలు, ఎంపీడీఓ కార్యాలయంలో సామూహిక శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కేజీబీవీ విద్యార్థులకు గ్రామపంచాయతీ నిర్వహిస్తున్న కార్యకలాపాలు, గ్రామంలో చెత్తసేకరణ వంటి పారిశుద్ధ్య పనులపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు స్వచ్ఛత కార్యక్రమంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రేగ రాజశేఖర్, ఉపాధ్యాయులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

మొరుమూరులో స్వచ్ఛత హీ సేవా

వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం సర్పంచ్ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శానిటేషన్ నిర్వహించారు. వీధుల్లో ఉన్న చెత్తతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

'వాటా ఎంతనేది స్పష్టం చేయాలి'



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

ఏటూరునాగారం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 33 శాతం మహిళా బిల్లులో బీసీ, ఎస్సీ, మైనార్టీల మహిళా వాటా ఎంత అనేది స్పష్టం చేయాలని ధర్మసమాజ్ పార్టీ ప్రచార కమిటీ జిల్లా నాయకుడు సురేష్ అన్నారు. శనివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లును వ్యతిరేకిస్తూ కేంద్ర దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 33 శాతం మహిళా బిల్లు పేరుతో దొరలకు బదులుగా దొరసానులు రాజ్యంలోకి రావడానికి చేస్తున్న కుట్ర అని ధర్మసమాజ్ పార్టీ తీవ్రంగా ఈ బిల్లును వ్యతిరేకిస్తోందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల మహిళలకు వాటా కల్పించే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ములుగు జిల్లా కమిటీ సభ్యులు శరణ్, రాజశేఖర్, తరుణ్, శరత్, సీతారామ్, రాజు, మహిళా నాయకులు దేవి, అనూష,సుమ, శ్రావణి, సౌజన్య, మహిళలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274